## కృష్ణప్రసాద్ 63వ సారి రక్తదానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో బుధవారం స్వస్థ్ నారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూజివీడు ఛైర్మన్ కృష్ణప్రసాద్ 63వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ నెలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేస్తే ఎటువంటి నీరసం గాని ఇబ్బందులు గాని ఉండవని చెప్పారు. 23 మంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గొల్లు దుర్గాదేవి, ముత్యాల కామేష్,సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి, మెడికల్ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఓగిరాల రామలింగేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది, మానవత, నూజివీడు సభ్యులు పాల్గొన్నారు.

# 3 నెలలు వరదల్లోనే..!

**పోలవరం నిర్వాసితుల పరిస్థితి అత్యంత దుర్భరం**
**జులై నుంచి ఇప్పటి వరకూ 8 సార్లు గోదావరికి వరద**
**నెలలు తరబడి జల దిగ్బంధనంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు**
**వాగుల ఉగ్రరూపంతో కాలు బయట పెట్టలేని పరిస్థితి**
**నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం**

ట్రాక్టర్‌పై సామాన్లు వేసుకుని తరలిపోతున్న నిర్వాసితులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులు అత్యంత దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నారు. నెలలు తరబడి వరదల్లోనే ఏజెన్సీ గిరిజనుల జీవితాలు మగ్గిపోతున్నాయి. ప్రతియేటా కంటే ఈసారి గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు ప్రత్యక్ష నం˜కం చూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది జులై మొదటివారం నుంచి అక్టోబర్ మొదటి తేదీ నాటికి మూడు నెల్లో గోదావరికి ఎనిమిదిసార్లు వరద పోటెత్తింది. ఒకే ఏడాది ఇన్నిసార్లు వరద ఎప్పుడూ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జులై 12న మొదటిసారి గోదావరికి వరద వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41.30 అడుగులు నమోదై మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువవుతూ తగ్గుముఖం పట్టింది. ఇక వరద ప్రమాదం తప్పినట్లేనని అంతా భావించారు. ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబర్ నెల ల్లోనూ వరద ఉధృతి కొనసాగింది. ఎనిమిదిసార్లు పోటెత్తిన వరద లకు భద్రాచలం వద్ద నీటిమట్టం నాలుగుసార్లు 43 అడుగులు దాట డంతో మొదటి ప్రమాద హెచ్చరిక, మూడుసార్లు 48 అడుగులు దాట డంతో రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన పరిస్థితి ఉంది. జులైలో మొదటిసారి వచ్చిన వరద మాత్రమే 41.30 అడుగుల వరకూ చేరి వెనక్కి తగ్గింది. ప్రస్తుతం సెప్టెంబర్ 27న మొదలైన వరద 30వ తేదీ కి భద్రాచలం వద్ద 50 అడుగులు దాటి మంగళ వారం నుంచి తగ్గు ముఖం పట్టిన పరిస్థితి ఉంది. వరదలకు కుక్కు నూరు మండలం లోని గుండేటి వాగు, వేలేరుపాడు మండలం లోని ఎద్దువాగులు ఉధృ తంగా ప్రవహించడంతో గ్రామాలకు రాకపో కలు నెలలు తరబడి పూర్తిగా నిలిచిపోయాయి. మూడు నెలలుగా అక్క డి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద ఉధృతి పెరిగి నప్పుడు పునరా వాస కాలనీలకు తరలివెళ్లడం, తగ్గుముఖం పట్టాక గ్రామాలకు చేరడం సర్వసాధారణమైంది. మిర్చి నారు దెబ్బతినడంతో రైతులు నష్టాలు సైతం చవిచూశారు. ఉపాధి లేక జీవనం దుర్భరంగా తయారైంది.

### పరిహారం ఇవ్వకుండా ఏళ్ల తరబడి ముప్పతిప్పలు

2026 చివరికల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయినట్లు నేతలు చెప్పుకొస్తున్నారు. ప్రాజెక్టుతో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు మాత్రం 12 శాతం పునరావాస ప్రక్రియ కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 110కుపైగా గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. 41.15 కాంటూరు, 45.75 కాంటూరు కింద ముంపు గ్రామాలను విభజన చేసి పరిహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. కాంటూరు లెక్కలన్నీ తప్పుగా నమోదు చేశారని, చిన్నపాటి వరదొచ్చినా కాంటూరుతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ మునుగుతున్నాయని నిర్వాసితులు గగ్గోలు పెడుతున్నారు. 41.15 కాంటూరు పరిధిలో 40 గ్రామాల వరకూ ఉండగా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీని అందించలేదు. ఇంటి పరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారంగాని, ఇంకా అనేక మందికి భూమికి భూమి ఇవ్వడం, నిర్వాసిత కాలనీల నిర్మాణం ఏఒక్కటీ పూర్తి చేయని పరిస్థితి ఉంది. గ్రామం వదిలొస్తే ప్రభుత్వం పరిహారం ఇచ్చే పరిస్థితి ఉండదు. పోలవరం మండలంలో ఖాళీ చేసిన గ్రామాల ప్రజల పరిస్థితిని అంతా ప్రత్యక్షంగా చూశారు. దీంతో తమకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిన తర్వాతే గ్రామాలు ఖాళీ చేస్తామని నిర్వాసితులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పోలవరం నిర్వాసితుల గోడు పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో నెలలు తరబడి వరదలకు ఎదురొడ్డి జీవనం సాగించాల్సిన దుస్థితి నిర్వాసితులకు ఏర్పడింది.

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద కొవ్వొతులతో నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి వైద్యులు

## సమస్యలు పరిష్కరించాలని పిహెచ్‌సి వైద్యులు నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమకు చంద్రన్న సంచార చికిత్సలో తమకు రావాల్సిన అలవెన్స్ రూ.4 వేలు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని పిహెచ్‌సి వైద్యులు డిమాండ్ చేశారు. ఏలూరులోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నుంచి ఏలూరు పాత బస్టాండ్ వరకు వారు బుధవారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఇన్ సర్వీస్‌లో ఉన్న డాక్టరకు పీజీ కోటా కింద 30 శాతం క్లినికల్ సీట్ల నుంచి 15 శాతానికి ప్రభుత్వం తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ క్లినికల్ కోటాలో 50 శాతం నుండి 30 శాతానికి తగ్గించారని, ఏజెన్సీలో పని చేస్తున్న వైద్యులకు ఏజెన్సీ అలవెన్స్ ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఎన్నిసార్లు చర్చలకు వెళ్లినా తమ ఆవేదనను అర్థం చేసుకోవట్లేదని, తమ సమస్యలను పరిష్కరించట్లేదని వాపోయారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అర్థం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## పలుకరిస్తూ.. యోగ క్షేమాలు ఆరా తీస్తూ..!

**మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టరు కె.వెట్రిసెల్విచే పెన్షన్ల పంపిణీ**

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వృద్ధులను పలుకరిస్తూ.. వారి యోగ క్షేమాలు ఆరా తీస్తూ.. మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం మండలంలోని అడవినెక్కలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బుడ్డగూడెం కాలనీల్లో సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, లబ్ధిదారులకు పెన్షన్ల సొమ్మును మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంయుక్తంగా అందజేశారు. తొలుత బుడ్డ గూడెం కాలనీ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి, కలెక్టర్ అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షన్‌దారులకు పంపిణీ చేసే సొమ్ము ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పది రెట్లు ఎక్కువ అని అన్నారు. ప్రతినెలా మొదటి రోజునే సామాజిక పెన్షన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నా మన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడు తూ పెన్షన్ సొమ్మును సద్వినియోగం చేసుకుని మంచి ఆరోగ్యంతో సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. జిల్లాలోని 5175 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయిస్తున్నట్లు తెలిపారు.



వృద్ధురాలికి పెన్షన్ సొమ్ము అందిస్తున్న మంత్రి పార్థసారథి

వృద్ధుని కాళ్లకు నమస్కరిస్తున్న మంత్రి పార్థసారథి

**వృద్ధుల అనుభవాలను నేటితరం గుర్తించి, గౌరవించాలి**

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి అడవినెక్కలం గ్రామ సచివాలయం వద్ద వృద్ధులకు పూలమాలలు, శాలువాలు కప్పి పండ్లు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వృద్ధుల పట్ల సమాజంలో నిర్లక్ష్యం పెరుగుతుందన్నారు. వృద్ధులకు గౌరవం, సంరక్షణ, వారి అనుభవాలను గుర్తించడం మనందరి బాధ్యత అన్నారు. కొన్నాళ్ల తర్వాత మనం కూడా వృద్ధాప్య దశకు వస్తామనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో చాలామంది వృద్ధులు ఒంటరితనం, నిరాదరణకు గురవుతున్నారన్నారు. వారికి బాసటగా నిలబడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వృద్ధులకు ఆర్థిక భద్రత, గౌరవం, ఆరోగ్య సంరక్షణ, హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంతోపాటు మనందరిపై ఉందన్నారు. నేటియువత వారి అనుభవాలను నేర్చుకుని, వారి సూచనలు, సలహాలను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఎంపిడిఒ బి.భార్గవి, డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వరద గోదావరి తగ్గుముఖం

**ప్రధాన రహదారులను వీడని ముంపు**

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ.. నిలకడగా ఉంటూ ముంపు మండలాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో మంగళవారం 50 అడుగులకు చేరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన గోదావరి వరద బుధవారం 46 అడుగులకు తగ్గింది.

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి పరవళ్లు

ఇప్పటికే ఆరు రోజులుగా గుండేటి, పాలవాగు కాజ్‌వేలు ముంపులోనే ఉండటంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. వరద తగ్గడంతో సీతారామనగరం-వేలేరు మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వరద బాధితుల కోసం బోట్లపై తరలిస్తున్న కూరగాయలు

**వేలేరుపాడు రూరల్:** గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి వరద కొంచెం తగ్గుముఖం పట్టినా రహదారులన్నీ జల దిగ్బంధనంలోనే ఉన్నాయి. కట్కూరు, కోయిదా, రేపాకగొమ్ము, రుద్రంకోట, నాళ్లవరం, చిగురుమామిడి తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టినా పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో మరో నాలుగైదు రోజులు మండలంలో వరద ప్రభావం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

**పోలవరం నుండి 11,06,947 క్యూసెక్కుల జలాలు విడుదల**

**పోలవరం:** ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు, కొండవాగులు గోదావరిలో కలుస్తుండడంతో నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన వరద గోదావరి బుధవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 11,06,947 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.650 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 33.990 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 24.050 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ మధ్య 16.100 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 12.70 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

# వృద్ధులు ఉచిత న్యాయ సలహాలను వినియోగించుకోండి

**ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులోని పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులు, సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో నిరాశ్రయులైన వృద్ధుల సంఖ్య నానాటికి పెరుగుతుందన్నారు. చిన్ననాటి నుంచి పిల్లలకు మానవతా విలువలపై అవగాహన కల్పించకపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నిర్వీర్యం కావడం వల్ల వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాల విలువలు పడిపోయాయని చెప్పారు. పెద్దవారి జీవిత అనుభవాలు పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని సూచించారు. వివిధ కారణాల వల్ల పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా ఉండటం, తల్లిదండ్రులను అశ్రద్ధ చేయడం వంటి సమస్య తలెత్తుతుందని, చట్టాలకు లోబడి ప్రభుత్వాలు, అలాగే స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వృద్ధాశ్రమంలో సభ్యుల సంఖ్య నానాటికి పెరుగుతుందని, వారి అవసరాలు గుర్తించి చట్టపరంగా వారికి ఉన్న హక్కులను వివరించి వారికి అండగా నిలబడేందుకు న్యాయ సేవాధికార సంస్థలు ఉన్నాయని తెలిపారు. వృద్ధులు వారి ఆస్తుల రక్షణలో కాని, వారి పిల్లల నుంచి భరణం పొందటంలో కాని అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు ఉచితంగా అందిస్తున్నాయని చెప్పారు. ఉచిత న్యాయ సలహాలకు 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. వృద్ధాశ్రమం నిర్వహించే వ్యక్తులు కనీస వసతులు ఏర్పాటు చేయాలని పరిశుభ్రమైన, పోషకాలు కలిగిన ఆహారం అందించడం, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం వంటి కనీస వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది పి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రత్నప్రసాద్

## మహిళలకు ఆరోగ్య పరీక్షలు అభినందనీయం

**ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గోదావరి మీటింగ్ హాలులో బుధవారం 300పైగా మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన సందర్భంగా ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి మహిళ ఉద్యోగిని క్రమం తప్పకుండా ప్రతి ఆరు నెలలకోకసారి ఆరోగ్య పరీక్ష లు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# రాచరికం ఉట్టిపడేలా దసరా వేడుకలు

**రెండో మైసూరుగా నూజివీడుకు జాతీయ ఖ్యాతి**
**73 ఏళ్లుగా అఖిలభారత చెడుగుడు పోటీలు**
**పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా**
**నేటి నుంచి ప్రారంభం**
**ప్రత్యేక ఆకర్షణగా బుట్టబొమ్మలు**
**వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

మురళి

సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణం అనగానే నోరూరించే మామిడి ఫలాలు... దసరా వేడుకలు... బుట్ట బొమ్మలు... యువతను ఉత్సాహపరిచే చెడుగుడు పోటీలు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలకు ఇట్టే గుర్తుకువస్తాయి. రాచరికపు పాలన నుంచి 500 ఏళ్లకు పైగా గొప్ప ఘన చరిత్ర కలిగిన నూజివీడు సంస్థానంలో దసరా వేడుకలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ స్పోర్టింగ్ క్లబ్, దేవాదాయ ధర్మాదాయ శాఖల సమన్వయంతో దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం దసరా ఉత్సవ, క్రీడా సాంస్కృతిక ట్రస్ట్‌గా రిజిస్టర్డ్ అయి దసరా వేడుకలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సకల సన్నాహాలు చేశారు. నూజివీడు సంస్థానానికి చెందిన ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ కళా ప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్, ఎలమర్రు ఎస్టేట్ జమీందార్ రాజా మేక శోభనాద్రి అప్పారావు బహదూర్, ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ డాక్టర్ ఎంఆర్.అప్పారావు బహదూర్, మీర్జాపురం ఎస్టేట్ జమీందార్ ఎన్‌విఎస్‌విజి.అప్పారావు బహదూర్‌ల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఖ్యాతి పొందేలా దసరా వేడుకలను నిర్వహించడం ద్వారా రెండో మైసూరుగా ఖ్యాతి పొందింది.

గతేదాది పురుషుల చెడుగుడు పోటీలు

తోపల్లి వెంకటప్పయ్య, మేజర్ ఎన్.రామారావు, కోనపులి సుబ్రహ్మణ్యం, దారుగ బాలకృష్ణ ర(రిఫరీ)ల ఆధ్వర్యంలో 60 మంది సభ్యులతో 1952వ సంవత్సరంలో నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఏర్పాటైంది. ఆనాటి నుంచి అఖిల భారత స్థాయి చెడుగుడు పోటీలను నిర్విరామంగా నిర్వహించేవారు. మొదటి మూడేళ్లు జై వీర హనుమాన్ పేరుతో రామిశెట్టి వీరరాఘవులు కెప్టెన్‌గా నూజివీడు టీమ్ విజేతగా నిలిచింది. ఆనాటి ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ కళా ప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ దసరా ఉత్సవ నిర్వహణ బాధ్యతను నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ వారికి అందించారు. ఆనాటి నుంచి దసరా ఉత్సవాలు, అఖిల భారత చెడుగుడు పోటీలు నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ ఎంఆర్.అప్పారావు, ఎలమర్రు ఎస్టేట్ జమిందార్ మేక శోభనాద్రి అప్పారావు, ఎంవిఎస్‌విజి.అప్పారావులు నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ చెడుగుడు పోటీలను ఎంతగానో ప్రోత్సహించేవారు. క్రీడాకారులైన పరిమిశెట్టి బాలకృష్ణ, బొబ్బిలి కొండలరావు ఆధ్వర్యంలో స్పోర్టింగ్ క్లబ్ సేవలు అజేయంగా నిలిచాయి. నూజివీడు చెడుగుడు మైదానంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరుపొందని ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభ పాటవాలను చాటి అందరి అభిమానాన్ని పొందగలిగారు. వారిలో అవధాని, పునుకొల్ల సాంబయ్య, కనుమూరి సోదరులు, మంటాడ నాగేశ్వరరావు, రైల్వే కోటేశ్వరరావు, గుండుగొలను మాధవ, నల్ల రంగారావు, అంజిరెడ్డి, బసవయ్య, పహిల్వాన్, నెల్లూరు కాంతారావు (తెలుగు సినీ ప్రముఖ నటులు, నిర్మాత), జింబో, చెంచయ్య, కడవకొల్లు రమేష్ వంటి ప్రముఖులు ఇదే క్రీడా మైదానంలో నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాభిమానుల కళ్లల్లో మెరుపులు మెరిపించి మైమరిపించిన అద్భుతమైన దృశ్యాలు ఎన్నో చోటు చేసుకుని నేటికీ పదిలంగా సుస్థిరంగా ఉన్నాయి. సంప్రదాయ బద్ధంగా కొనసాగే చెడుగుడు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేసే సమయంలో సినీ నటులు, దర్శకులు ఎస్‌వి.రంగారావు, ఎన్‌టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, రేలంగి, సూర్యకాంతం, నటశేఖర కృష్ణ, నటభూషణ శోభన్ బాబు, మహానటి సావిత్రి, విలక్షణ నటుడు రావుగోపాలరావు, హాస్యనటులు అల్లు రామలింగయ్య, దర్శకులు దాసరి నారాయణరావు, జంధ్యాల, చలం, తెలుగు నటి శారద, హాస్యనటులు సుధాకర్, సుత్తివేలు వంటి ప్రముఖులు ఎందరో తారాగణంగా హాజరై క్రీడాకారులను, అభిమానులను ఉత్సాహపరిచేవారు. స్పోర్టింగ్ క్లబ్ ప్రస్తుతం దసరా ఉత్సవ, క్రీడా సాంస్కృతిక ట్రస్ట్‌గా రిజిస్టర్డ్ అయి దసరా వేడుకలను నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, పగడాల సత్యనారాయణ తెలిపారు.

బుట్టబొమ్మలు

గతేదాది మహిళల చెడుగుడు పోటీలు

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

**సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపి రాజానాయన**

**తమకు నిధులు మంజూరు చేయలేదని పలువురు ఎంపిటిసిల ఆవేదన**

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిషత్ ద్వారా వచ్చిన నిధులు ఆయా ఎంపిటిసిల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించాలని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన కోరారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.ఏసుబాబు ఆధ్వర్యంలో, ఎంపిపి కొండా దుర్గాభవాని అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ, విద్యుత్ రంగాలను అభివృద్ధి పథంలో నడిపిస్తే రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాడన్నారు. మండల వ్యవసాయ అధికారి ఆలూరు చాముండేశ్వరి మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ పొందాలన్నా, పంట అమ్ముకోవాలన్నా కౌలు కార్డు అవసరమని చెప్పారు. యజమాని పాస్ పుస్తకం, ఖాతా నెంబర్‌తో కౌలు కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ కౌలు కార్డు ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. ప్రస్తుతం మండలంలో అత్యధికంగా పామాయిల్ పంట సాగు చేస్తున్నారని, గతంలో మిర్చి పంట సాగు చేసేవారని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 113 ఎకరాలు మాత్రమే మిర్చి పంట సాగు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు అధిక దిగుబడి ఎలా పొందాలో వివరించారు. విద్యుత్ శాఖ ఎఇ మాట్లాడుతూ మండలంలో నాలుగు వేల వ్యవసాయ సర్వీసులు ఉన్నాయని, కొత్తగా వ్యవసాయ సర్వీసులు కోరుకునే రైతులకు ప్రభుత్వం ముందుగానే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తుందని తెలిపారు. అదే విధంగా ఇంట్లో విద్యుత్ వినియోగం కోసం సోలార్ సిస్టం ఉపయోగిస్తే లబ్ధిదారుడు లబ్ధి పొందవచ్చని చెప్పారు. ఆర్అండ్‌బి శాఖాధికారులు రోడ్లు సక్రమంగా బాగు చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ కోరారు. ఎంపిటిసి నిధులందరికీ సమాన పక్షంలో మంజూరు చేయకుండా, అధికార పార్టీ వారు మంజూరు చేసుకుని అధికారంలో లేని ఎంపిటిసిలను పక్కన పెడతారా ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, వైస్ ఎంపిపి-2 పాములు గంగాధరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సహకార బ్యాంకు అధ్యక్షులు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి రాజానాయన

దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పారిశుధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు దాసరి శేషుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 200 పైగా దేశాల్లో 1.35 మిలియన్ సభ్యులు కలిగిన ఏకైక అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్ అని కొనియాడారు. డిఎస్‌పి రవిచంద్ర మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అనర్వచనీయమన్నారు. తక్కువ వేతనంతో ఎక్కువ పని చేసే పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రజలకు, సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, సిఐ సుభాష్, లయన్స్ క్లబ్ నాయకులు అట్లూరు సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు, పంతగాని వెంకన్న, కన్నం హనుమంతరావు, కాకర్ల వీరభద్రరావు, కొప్పుల రవిచంద్రారెడ్డి, ఉక్కుర్తి సీతారాం, నంగులూరి జగత్ కుమార్, సీతారామరాజు, కొండపల్లి పండు, నంబూరి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యాన కూరగాయల వితరణ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు పట్టణ పరిధిలోని శ్రీ రామకృష్ణ సేవాసమితిలో తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు బుధవారం కూరగాయలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఛైర్మన్, రిటైర్డ్ విఆర్‌ఒ సత్యనారాయణమూర్తి, బ్రహ్మచారి భాస్కరన్ స్వామీజీ మాట్లాడుతూ వయోవృద్ధులు, వికలాంగులు 40 మందికి నిత్యాన్నదానం నిర్వహించారు. సాయంత్రం వేళ మరో 40 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు భోజనం అందించారు. చిన్నారులకు శక్తిసామర్థ్యాలు పెంపొందించేందుకు న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్లు అందించారు. తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ అనేక పర్యాయాలు కూరగాయలు వితరణగా అందించినట్లు తెలిపారు. కృష్ణ ఆధ్వర్యంలో అనేకమంది మిత్రులు, ఆత్మీయులు, అనేక శాఖలకు చెందిన అధికారులచే కూరగాయలు వితరణగా అందించిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. సమాజంలో ఉన్న అన్ని తరగతుల ప్రజలు రామకృష్ణ సేవా సమితిలో అన్నదాన వితరణ అందుకుంటున్న పేదలకు అవకాశం మేరకు వస్తురూపమైన వితరణ అందించి దాతృత్వం చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి నీలా వన వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు గరికపూడి నాగమల్లేశ్వరరావు, తిరివీధి కృష్ణ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సన్మానం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం పలువురు వృద్ధులను సన్మానించారు. వడాలి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల వృద్ధాప్య దినాల్లో పిల్లలు వారికి ఏ లోటు లేకుండా ప్రేమతో సహాయకరంగా ఉండి ఆదరించాలన్నారు. వృద్ధాప్యంలో వారిని అనాథలుగా విడిచి పెట్టకూడదని, కష్ట కాలంలో వారికి సహాయం సహకారాలు అందించి గౌరవించాలన్నారు. అనంతరం వృద్ధులు నక్క అప్పారావు, అనగాని నానిలను శాలువాలు కప్పి పూల దండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.అశోక్, పంచాయతీ కార్యదర్శి వై.శ్యాంసుందర్, కట్టా రామయ్య, చిలకలపల్లి నాగరాజు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళను ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పేరంపేట గ్రామ సమీపంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన సాదే పెంటమ్మ (45) పట్టణంలోని చందనబ్రదర్స్‌లో పని చేస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం యథావిధిగా ఆమె డ్యూటీకి వెళ్లేందుకు బైక్‌పై వస్తున్న వ్యక్తిని లిఫ్టు అడిగి జంగారెడ్డిగూడెం బయలుదేరింది. బైక్ పేరంపేట గ్రామ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెపై ట్రాక్టర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ జంగారెడ్డిగూడెం శ్రీరామచంద్ర పాల డెయిరీకి చెందింది. జంగారెడ్డిగూడెం నుంచి పంగిడిగూడెం ఏరియాలో గడ్డి తీసుకురావడానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

మృతురాలిది నిరుపేద కుటుంబమని, భార్యాభర్తలు పనులు చేసుకుని పిల్లలను చదివిస్తున్నారని, వారి కుటుంబానికి న్యాయం చేయాలని మృతురాలి బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు. మృతురాలి భర్త శ్రీను కూలి పనులకు వెళుతుంటాడు. పెద్దకుమార్తె మెరిసి (19) బిఎస్‌సి నర్సింగ్ సెకండియర్, చిన్న కుమార్తె పావనిశ్రీ (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతుంది.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని దర్భగూడెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... దర్భగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2,100 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని, వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వరకట్న వేధింపులపై కేసు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

వరకట్నం వేధింపులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని అప్పారావుపేటకు చెందిన దేసిన ప్రియాంకకు 2018లో కృష్ణా జిల్లా పెడన మండలం కోటవానిపాలెం గ్రామానికి చెందిన పరసా శ్రీకాంత్‌తో వివాహమైంది. వివాహ సమయంలో పసుపు కుంకుమల కింద రూ.ఐదు లక్షలు, రెండు ఎకరాల పొలం ఇచ్చారు. అనంతరం 12 కాసుల బంగారం, ఒక లక్ష రూపాయల నగదు సారీ సామానంతో ప్రియాంకను కాపురానికి పంపించారు. అయినా భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త శేషమ్మ అధిక కట్నం తేవాలని శారీరకంగా మానసికంగా హింసిస్తున్నట్లు, కాపురానికి తీసుకు వెళ్లకుండా వేధిస్తున్నట్లు ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

భార్యను మానసికంగా వేధిస్తున్న భర్తపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రమ్మ కాలనీకి చెందిన చిర్రి బాలరాజుకు ఓ మహిళతో 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల తన భర్త వ్యసనాలకు బానిసై తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు బాలరాజు భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు బాలరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# పైపులైన్ లీకేజీతో ఇబ్బందులు

### నెలలు గడుస్తున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

పంచాయతీ పైపులైన్ లీకేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా లీకేజీతో నీరు వృథాగా పోతున్నా గ్రామపంచాయతీ పట్టించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ముదినేపల్లి-బంటుమిల్లి ఆర్అండ్‌బి రహదారిలో మండలంలోని వడాలి సెంటర్‌లోని బస్టాప్ వద్ద నెలకొంది. కొన్ని నెలలుగా పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా ప్రధాన రహదారిలో పారుతుంది. చాలాకాలంగా ఈ పరిస్థితి ఉండడంతో ఆ ప్రాంతమంతా పాకుడు కట్టి పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. లీకేజీ నీరంతా రోడ్డు వెంబడి పారుతూ బస్టాప్, దుకాణాల ముందు నిల్వ ఉంటుంది. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దుకాణాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల కోసం దుకాణాలకు వెళ్లాలంటే నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిందే. చాలా నెలలుగా నీరు వృథాగా పోతుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన రావడంతో పాటు పాకుడు కట్టడంతో పాదచారులు కాలు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై అనేకసార్లు గ్రామపంచాయతీ ఇబ్బందికి, కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

ఇప్పటికైనా పంచాయతీ సర్పంచి, కార్యదర్శి వెంటనే స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ప్రజలిచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని ప్రతినెలా విధిగా సామాజిక పెన్షన్ల పంపిణీ క్రతువును సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. 23వ డివిజన్ పిరంగుల దిబ్బలో బుధవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపుమేరకు నిత్యం ప్రజల మధ్యనే ఉండేందుకు అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే ప్రతినెలా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో తానుకూడా భాగస్వామి అవ్వడంతో పాటూ, ఆయా ప్రాంతాల్లోని సామాన్యుల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వారికి అండగా నిలబడేలా తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం శాంతినగర్ 9వ రోడ్డు వద్ద ఎన్‌టిఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, టిడిపి ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, క్లస్టర్ ఇన్‌ఛార్జి గూడవల్లి శ్రీనివాస్, డివిజన్ ఇన్‌ఛార్జి రెడ్డి రామకృష్ణ, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కుటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టిఆర్ సామాజిక భరోసా



ఏలూరు సిటీ : పింఛన్లు పంపిణీ చేస్తున్న బడేటి చంటి

నెలవారీ పింఛన్ల పథకంలో భాగంగా బుధవారం జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్ ఏరియాతో పాటు డాంగేనగర్‌లో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల కుటుంబ యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ పంపిణీ చేస్తున్నారా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి** : మండల వ్యాప్తంగా 4234 పింఛన్లకు 3991 పింఛన్లు సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. పింఛన్ల పంపిణీలో కొద్ది సేపు సర్వర్ ఇబ్బంది పెట్టినా పంపిణీ ఆగలేదన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలం మొత్తమ్మీద తొలిరోజు 94.2 శాతం పూర్తైనట్లు తెలిపారు.

**దెందులూరు** : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతినెలా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక పండగలా నిర్వహిస్తూ పింఛనుదారులకు మరింత అండగా నిలుస్తున్నామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు మండలం గోపన్నపాలెం, సోమవరప్పాడు గ్రామాల్లో బుధవారం ఉదయం నిర్వహించిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి దెందులూరు మండలాధ్యక్షులు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లు బాబు) సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ముసునూరు** : పెన్షన్ల పంపిణీ ద్వారా వృద్ధులకు మేలు చేకూరుతుందని టిడిపి గుడిపాడు అధ్యక్షులు మండలపు ధర్మరాజు అన్నారు. మండలంలోని గుడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ప్రజాశక్తి - దెందులూరు**

కేంద్ర ప్రభుత్వం సవరించిన జిఎస్‌టి విధానం వల్ల అన్ని రంగాల ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండలంలోని గోపన్నపాలెంలో ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రాంగణంలో సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికార యంత్రాంగం, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిఎస్‌టి సవరణ వల్ల అన్ని రంగాల ప్రజలకు ఏ విధంగా లబ్ధి జరుగుతుందనే అంశాలపై ప్రతివారం ఒక ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 2027 నాటికి దెందులూరు మండలంలో ఉన్న అప్‌ల్యాండ్ పొలాలన్నిటిని కూడా పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానం చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటి వరకు కొవ్వలి, పోతునూరు, దోసపాడు గ్రామాల వంటివి గోదావరి జలాలు దెందులూరులో కొంత భాగం మాత్రం అనుభవిస్తున్నాయని, ఇప్పటికే కొప్పులవారిగూడెం ఎస్కేప్ ద్వారా పలు గ్రామాలకు నీరు అందిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన రైతుల లోన్ అప్లికేషన్లను బ్యాంకర్లు సత్వరమే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని, గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాల అభివృద్ధికి సహకరించేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని, నియోజకవర్గ పరిధిలోని రైతులకు నూతన రైతు రథాలు మంజూరయ్యేలా మరిన్ని చర్యలు చేపట్టాలని కోరుతున్నట్లు తెలిపారు.

**ముదినేపల్లి** : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టితో రైతాంగానికి ఎంతో మేలు ఒనగూరిందని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ సబ్సిడీపై అందించిన వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్, ఎడిఎ జి.వెంకటమణి మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి గురజ సెంటర్ వరకు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, సొసైటీ ఛైర్మన్ చలసాని జగన్‌మోహన్‌రావు, పోసిన పాండురంగారావు, బొంగు రవికుమార్, కోటప్రోలు కృష్ణారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పోలవరం** : రైతులకు, ప్రజలకు ప్రచార అవగాహన కార్యక్రమం పోలవరం రైతు సేవా కేంద్రం-1లో వ్యవసాయ అధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడారు. తహశీల్దార్ సాయి రాజు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రైతు సేవా కేంద్రం-1 నుంచి స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి వీర వెంకట సత్యనారాయణ(చిన్ని), కృష్ణారావుపేట సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, కొత్త పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు పూడి వెంకట్రావు, పాత పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, నీటి సంఘం ప్రెసిడెంట్ పాదం ప్రసాద్, జనసేన పార్టీ ఐటి వింగ్ కోఆర్డినేటర్, గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ ఆటపాకల వెంకటేశ్వరరావు, కరిబండి నాగరాజు, కూటమి నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**టి.నరసాపురం** :రైతుకు చేయూత దేశ ప్రగతికి బాట అని మండల వ్యవసాయ అధికారిణి ఎం.ప్రియాంక తెలిపారు. టి నరసాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలపై జిఎస్‌టి తగ్గించి రైతులకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలపై, పరికరాలను బట్టి 18 శాతం నుంచి ఐదు శాతం జిఎస్‌టి తగ్గించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.నరసాపురం సొసైటీ చైర్ పర్సన్ జోనుబోయిన సోంబాబు, ఎంపిటిసిలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, ఎఇఒ గంగాధరరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ద్వారకాతిరుమల** : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. మండల ఉద్యానవన శాఖాధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్** : మండలంలోని మోర్సపూడి గ్రామంలో రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి అధికారిణి హేమ, బిజెపి నాయకులు గోగినేని అప్పారావు, టిడిపి మోర్సపూడి గ్రామ నాయకులు పిన్నమనేని ప్రదీప్(నాని), సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం** : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, మండల వ్యవసాయాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కరించరూ.!

### కనకాద్రిపురం వాసుల వేడుకోలు
### రోగాల బారిన పడుతున్నామని ఆవేదన
### పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

మండలంలోని కనకాద్రిపురం గ్రామంలో ప్రజలు గత మూడు నెలలుగా మురుగు నీరు తాగుతున్నారు. గ్రామ సర్పంచి, గ్రామ కార్యదర్శి సమస్య పరిష్కారానికి చొరవ చూపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో తమకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నామని చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడ్డారని వాపోతున్నారు. తాగునీటి కలుషితం సమస్యపై ఈ నెల 15వ తేదీన కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పరిశీలనకు వచ్చిన గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ తాగునీటి బోరు పరిశీలించి ఈ నీరు ఎలా తాగుతున్నారని ఆశ్చర్యం వ్యక్తపరిచారు. ఫిర్యాదు పరిష్కారానికి నీటిని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపారు. ల్యాబ్ నివేదిక అభ్యంతరకరంగా ఉండటంతో మరోసారి డిఇ, జెఇ సంయుక్తంగా వచ్చి కనకాద్రిపురం గ్రామస్తులకు ప్రత్యేకంగా బోరు వేయటానికి రెండు స్థలాలు పరిశీలించారు. అందుకోసం నిర్దేశించిన ప్రతిపాదనల ఆమోదం ఆలస్యమవుతాయని తెలిపినట్లు గ్రామస్తులు బొజ్జియ, రాజవరపు శ్రీను, బల్లె నరేంద్ర తెలిపారు. ఈ లోపు పాత బోరు ఫ్రెషింగ్ చేయిస్తామని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు దారుడికి ఇచ్చినట్లు తెలిపారు. ఆ మేరకు గ్రామ కార్యదర్శికి ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు. గ్రామ కార్యదర్శి గ్రామ సమస్యలు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయని వాపోతున్నారు. గ్రామ కార్యదర్శి గ్రామానికి వచ్చి హాజరు వేసి మీటింగ్ ఉందని వెళ్లిపోతున్నారని విమర్శలు ఉన్నాయి. గ్రామ కార్యదర్శి సమస్యలు గాలికొదిలి రాజకీయాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏ సమస్య అడిగినా ప్రభుత్వం నిధులు ఇస్తే చేస్తామంటున్నారని కార్యదర్శిపై గ్రామ మహిళలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై తమకు సందేహాలున్నాయని, గ్రామ కారదర్శిపై పూర్తి స్థాయి విచారణ జరపాలని తెలుగు యువత నాయకులు మాచర్ల గణేష్, జనసేన నాయకులు దుగ్గిరాల పెద్దిరాజు, బల్లె నరేంద్ర కోరుతున్నారు.

ఎరుపురంగులో వస్తున్న నీరు

## విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలి

**ఏలూరు అర్బన్** :విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి, విద్యుత్ సంస్థలో నియమాకాలు చేపట్టాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏలూరు స్ఫూర్తి భవనంలో విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు పి.జాకబ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత 20 ఏళ్లుగా విద్యుత్ మీటర్ రీడర్స్ విద్యుత్ సంస్థలో పని చేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఫిబ్రవరి నెలలో విద్యుత్ సంస్థ అడిషనల్ సెక్రటరీ మూడు డిస్కం సిఎండిలతో యూనియన్‌కు రాతపూర్వక ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. దాని ప్రకారం విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సంస్థలో ఉపాధి కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)**
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332
**SPOT ADMISSIONS: APECET-2025**
Vacant Seats in the **2nd Year B.Tech** (Lateral Entry) that may arise out of non-reporting of the students to be filled by the college under Spot Admissions. Interested and eligible candidates (As per APSCHE Guidelines available in **ECET-2025** Admissions Website) are requested to approach the college with their original certificates and get themselves registered for the admission on or before **05-10-25.** The admission made is provisional and is subjected to ratification by APSCHE and JNTUK.
***Note:The Students who are admitted under spot admissions are not eligible for the fee reimbursement by the Govt of Andhra Pradesh.***
***Principal***

## పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఏజెన్సీ ప్రాంతాల్లో సేవలందిస్తున్న డాక్టర్ల డిమాండ్లు పరిష్కరించాలని ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాములు దొర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్ సర్వీస్‌లో ఉన్న డాక్టర్లకు పీజీ కోట సీట్లు క్లినికల్ 30 శాతం నుండి 15 శాతానికి తగ్గించడం, ఏజెన్సీలో పనిచేస్తున్న డాక్టర్లకు ఏజెన్సీ అలెవెన్సులు ఇవ్వకపోవడం, టైం బౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించకపోవడం అన్యాయం చేసినట్లే అని తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాడుతున్న డాక్టర్లకు ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కలిదిండి**

ప్రమాదవశాత్తూ కాలికి గాయమై నడవలేని స్థితిలో ఉన్న భవన నిర్మాణ కార్మికుడు వట్టి సుబ్రహ్మణ్యానికి రూ.ఏడు వేల ఆర్థిక సాయాన్ని ఆ సంఘం నాయకులు అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) మండలాధ్యక్షులు అక్బర్ భాషా, కటికల శ్రీనివాస్, పరసా రాజేష్, బత్తిన వెంకట సూరిబాబు, ఖలీల్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

**ప్రజాశక్తి - చింతలపూడి**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చెప్పారు. పాత చింతలపూడి గ్రామంలో గత కొన్నేళ్ల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా కొత్త బోరు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామస్తులకు త్రాగునీరు అందించాలని, మరొక బోరు వేయాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. తాగునీరు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం కొత్తగా వేసిన బోర్ పాయింట్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్, కొత్త మోటార్ సెట్ ఏర్పాటు చేసి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రీ సర్వేకు సహకరించాలి

**ప్రజాశక్తి - చింతలపూడి**

మండలంలో మొత్తం 38 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటివరకు ఏడు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించినట్లు చింతలపూడి ఇన్‌ఛార్జి తహశీల్దార్ స్లీవ జోజి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామవరం, పొనుకుమాడు, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, వెంకట్రాయపురం ఈ ఐదు గ్రామాల సరిహద్దు, భూముల రీ సర్వే, రైతుల భూములు కూడా రీ సర్వే పూర్తి చేయాలని తహశీల్దార్ చెప్పారు. ఐదు గ్రామాల్లో టాం టాం వేయించడం, గ్రామసభలు నిర్వహించడం ద్వారా రీ సర్వే చేసేవిధానం గురించి అధికారులు రైతులకు వివరించారు. అధికారులు రీ సర్వే చేసే ముందు రోజు ప్రతి రైతుకు నోటీసు ఇస్తారని, ఆ రోజు అదే విధంగా సంబంధిచిన పత్రాలతో హాజరవ్వాలని కోరారు. హద్దులను చూపిస్తే సర్వే చేసి, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేస్తారని తెలిపారు. రేషన్ స్మార్ట్ కార్డులు మండలంలో వివిధ గ్రామాలకు సంబంధించి 2500 వరకు విఆర్‌ఒ రేషన్ డీలర్ వద్ద ఉన్నాయని చెప్పారు. 2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేయాలని భారత ఎన్నికల కమిషనర్ ఆదేశించారని తెలిపారు. దరిమిల బూత్ లెవెల్ అధికారులందరూ 2025 ఓటర్ల లిస్టును మ్యాపింగ్ చేసేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు.

**IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), KOVVUR**
**E.P. No. 21/2024**
**FD I.A. No. 7/2022**
**O.S. No. 357/2019**
*Between:*
Smt. Gadi Ramalakshmi
***...D.Hr/Petitioner/Plaintiff***
AND
Smt. Jakka Malathi.
***...J.Dr/Respondent/Defendant***
*To:*
***J.Dr/Respondent/Defendant:***
Smt. JakkaMalathi, W/o. Somraju @ Somaraju, Age 40 Years, resident of D.No. 23-12-7/9, Vemuri Residency, Flat No. 302, Opp: ESI Hospital, PenumatsaVari Street, Sajjapuram, Tanuku, W.G.Dt.,

పై నెంబరు గ్రంధములో E.P సంగతులు తెలియజేయు నిమిత్తం J.Dr/ Respondent/ Defendant అయిన మీకు కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను Order 21 Rule 66 CPC క్రింద ఎన్ని పర్యాయాలు E.P నోటీసులు పంపినప్పటికీ సదరు J.Dr/ Respondent/ Defendant బుద్ధి పూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా E.P సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు E.P లో మీకు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల **ది. 14-10-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
***వాయిదా : 14-10-2025***
**వల్లభశెట్టి సురేష్**
D.Hr/ పిటిషనర్/ వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు Cell. 9299908580.
ది. 29-09-2025 కొవ్వూరు, తూ॥గో॥జిల్లా